క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కిస్తీ


దర్గా వద్ద కిస్తీకి హాజరైన భక్తులు

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరులో శ్రీఅల్లిహుసేన్ స్వామి వారి ఉరుసు సందర్భంగా శుక్రవారం సాయంత్రం కిస్తీ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గ్రామస్తులు ఫలహారం బండ్లను ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకువచ్చి అక్కడ స్వామివారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉరుసు ఉత్సవాలను తిలకించేందుకు వర్కూరువాసులే గాకా చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావడంతో దర్గా ప్రాంగణం కిక్కిరిసింది. ఉరుసు సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కోడుమూరు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

శ్రీశైలానికి శివస్వాములు


ఇరుముడులతో శ్రీశైలానికి బయలుదేరుతున్న శివ దీక్ష స్వాములు

కల్లూరు: మండల పరిధిలోని కల్లూరు అర్బన్ పందిపాడు గ్రామానికి చెందిన శివదీక్షధారులు శుక్రవారం ఇరుముడులతో శ్రీశైలానికి బయలుదేరారు. ఈ సందర్భంగా హనుమాన్ కళా సమితి అధ్యక్షుడు హనుమంతురావు చౌదరి దంపతులు శివన్న తోటలో వెలసిన శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివస్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

శివస్వాములకు అన్నదానం


శివస్వాములకు అన్నదానం చేస్తున్న దృశ్యం

గూడూరు రూరల్: కె.నాగలాపురంలోని సుంకులాపరమేశ్వరీదేవి ఆలయం ఆధ్వర్యంలో శుక్రవారం శివస్వాములు, పాదయాత్రికులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు కార్యనిర్వహణ అధికారి దినేష్ తెలిపారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు స్థానిక ఈశ్వరాలయంలో అన్నదానం చేస్తామన్నారు. శ్రీశైలం వెళ్తున్న శివస్వాములతో పాటు పాదయాత్రగా వెళ్తే భక్తులకు మూడు పూటలా అన్నదానం ఉంటుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కొత్తూరు సుబ్బరాయుడికి ఆదాయం


వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం: వివిధ వేలాల ద్వారా మండల పరిధి లోని కొత్తూరు శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి కి ఆదాయం సమకూరిందని ఈఓ రామక్రిష్ణ తెలిపారు. టెంకాయలు, పూలు, గాజులు, పటముల విక్రయాలకు శుక్రవారం వేలంపాట నిర్వహించారు. టెంకాయల విక్రయ హక్కుల ను రూ.14.40 లక్షలకు మైదుకూరు పట్టణానికి చెందిన అంజనమ్మ, పూల విక్రయ హక్కులను రూ.1.78 లక్షలకు తూర్పు గోదావరికి చెందిన సూర్యనారాయణ, గాజులు, పటముల విక్రయ హక్కులను రూ.25 వేలకు కాల్వబుగ్గకు చెందిన వరలక్ష్మి దక్కించుకున్నారని ఈఓ తెలిపారు. వేలంపాటల్లో పర్యవేక్షణ అధికారి నాగిరెడ్డి, గ్రామ పెద్దలు క్రిష్ణారెడ్డి, శివరామిరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సుంకేసులకు ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు 1,450 క్యూ సెక్కుల ఇన్ ఫ్లో ఉందని శుక్రవారం డ్యాం అధికారులు తెలిపారు. కేసీ కాల్వకు 1,058 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని, డ్యాంలో 0.813 టీఎంసీల నీరు నిల్వ ఉందని వారు తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కల్లూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ సచివాలయ ఏఎన్ఎం పద్మావతి సూచించారు. ఆశా కార్యకర్తలు రాజమ్మ, సుజాత, లక్ష్మీదేవిలతో కలిసి ఆమె శుక్రవారం బస్తిపాడు గ్రామంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో పర్యటిస్తూ డ్రమ్ముల్లో, నీటి తొట్లలో, గచ్చుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమ లార్వాలు పెరిగి రోగాలు ప్రబలుతాయని వివరించారు.

పాణ్యంలో అభివృద్ధి 'వెలుగులు'

- కందికాయపల్లెలో రెండు విద్యుదుత్పాదక పరిశ్రమలు
- గత ఏడాది అనుమతులిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- ముమ్మరంగా సాగుతున్న సర్వే పనులు
- పరిశ్రమల ఏర్పాటుతో స్థానికులకు లభించనున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



కందికాయపల్లె బోర్డు


భూములను పరిశీలిస్తున్న జేసీ నిషాంతి


సోలార్ పరిశ్రమకు కేటాయించిన భూములు

పాణ్యం: పారిశ్రామికంగా పాణ్యం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే పలు పరిశ్రమలు ఏర్పాటైన మండలానికి మరో రెండు భారీ విద్యుదుత్పాదన పరిశ్రమలు రానున్నాయి. ఇందుకు సంబంధించిన భూ సర్వే పనులు ప్రస్తుతం చకచకా జరుగుతున్నాయి. ఆలమూరు రెవెన్యూ గ్రామమైన కందికయపల్లె గ్రామం మండల కేంద్ర పాణ్యానికి 24 కిలోమీటర్ల దూరంలో కొండపై ఉంటుంది. ఇక్కడ 2,850 ఎకరాల్లో ఏఎం గ్రీన్‌కో సంస్థ సోలార్, విండ్ పరిశ్రమలను నెలకొల్పనుంది. ఇటీవలే జేసీ నిషాంతి ఆయా పరిశ్రమలకు కేటాయించిన భూములను పరిశీలించారు.

గత ఏడాదే సర్కారు అనుమతులు:
గత ఏడాది ప్రభుత్వం ఏఎం గ్రీన్ కో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌కు రెండు విద్యుత్ పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. ఇందులో ఒకటి సోలార్, మరొకటి విండ్ (పవన విద్యుత్). సోలార్ ద్వారా రోజుకు 700 మెగావాట్లు, విండ్ ద్వారా 300 మెగావాట్ల చొప్పున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నారు. కాలుష్య రహిత పరిశ్రమలైన ఈ రెండింటికి ఏఎం గ్రీన్‌కో రూ. 4,500 కోట్ల మేరా పెట్టుబడులు పెట్టనున్నట్లు సమాచారం.

వెయ్యి మందికి ఉపాధి
రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన జీవో ద్వారా పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో స్థానికులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. దాదాపు 70 శాతం మేర ఉద్యోగాలు ఇస్తారు. ఈ లెక్కన కొత్తగా ఏర్పాటయ్యే సోలార్, విండ్ పరిశ్రమల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి మంది వరకు ఉపాధి లభించే అవకాశం ఉండటంతో స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతుంది.

గత ఏడాది పిన్నాపురంలో భారీ పరిశ్రమకు శ్రీకారం
మండలంలోని పిన్నాపురం గ్రామంలో సోలార్, విండ్ హైడ్రో పవర్ తయారీ పరిశ్రమకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గత ఏడాది మే 17న శంకుస్థాపన చేశారు. 5,230 మెగావాట్ల విద్యుదు ఉత్పత్తి చేసే ఈ పరిశ్రమకు ఏఎం గ్రీన్‌కో ఎనర్జీ ప్రైయివేట్ లిమిటెడ్ రూ. 3 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టింది.

సర్వే ముమ్మరం చేశాం



ఏఎం గ్రీన్‌కో ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు కేటాయించే భూములకు సంబంధించి సర్వే వేగంగా జరుగుతుంది. మండల సర్వేయర్ నాగ ప్రసాద్‌తో పాటు మరో రెండు విలేజ్ సర్వేయర్ల టీమ్‌ల ద్వారా ఈ పనులు చేస్తున్నాం. ప్రభుత్వ భూమికి సంబంధించి 1000 ఎకరాల సర్వే రిపోర్టును పంపించాం. త్వరలో ఇతర భూములకు సంబంధించిన సర్వే రిపోర్టు పంపిస్తాం.

–మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్

నాడు-నేడు పనుల్లో నాణ్యత పాటించాలి


పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ అనంతయ్య

కోడుమూరు రూరల్: మండలంలో 2వ విడత నాడు–నేడు కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని ఎంఈఓ అనంతయ్య సూచించారు. శుక్రవారం స్థానిక బాలుర హైస్కూల్‌ను ఎంఈఓ తనిఖీ చేసి, పాఠశాల రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న 10 అదనపు తరగతి గదుల నిర్మాణాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

వేసవిలో పంటలు సాగుచేయొద్దు


మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: వేసవిలో బోరుబావుల కింద పత్తి పంట సాగు చేయరాదని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులతో ఏఓ రవిప్రకాష్ సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రబీ కింద పంటలు సాగు చేసిన రైతులంతా తప్పక పంట నమోదు చేయించుకునేలా కమిటీ సభ్యులు ఆయా గ్రామాల రైతులకు సూచించాలన్నారు. వేసవిలో పత్తి సాగు వల్ల నష్టం తప్ప లాభం ఉండదని, రైతులు తెలుసుకుని పంట సాగు చేయరాదన్నారు. మొక్కజొన్న, వేరుశనగ, శనగ పంట దిగుబడుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. సమావేశంలో ఏఈఓ తస్లీమ్, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


అధికారులతో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఓర్వకల్లు: మండలంలోని మీదివేముల గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయనున్నట్లు కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణతో కలసి గ్రామంలో పర్యటించి, ఎక్కడెక్కడ తాగునీటి సమస్య ఉందని ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్సీ కాలనీ, కురువ గేరి, ఉయ్యాలవాడ రహదారి, కొత్త బిల్డింగ్‌లలో నాలుగు ట్యాంకులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ట్యాంక్‌ల ఏర్పాటుకు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారికి సూచించారు. వారి వెంట ఎంపీటీసీ సభ్యులు పద్మనాభరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ, సచివాలయ కన్వీనర్లు జగన్‌మోహన్‌రెడ్డి, రమేష్ నాయుడు, గృహ సారథులు ఉన్నారు.

ఉద్యోగం రాకుండా సర్టిఫికెట్లు మార్చేశారు!

- వైద్య ఆరోగ్యశాఖ తీరుపై ఓ అభ్యర్థిని ఆవేదన

కర్నూలు(హాస్పిటల్): తనకు ఉద్యోగం రాకుండా చేసేందుకు, ఇతరులకు ఉద్యోగం కట్టబెట్టేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు తన సర్టిఫికెట్ల స్థానంలో ఇతరుల సర్టిఫికెట్లు ఉంచారని మాలతి అనే అభ్యర్థిని ఆరోపించారు. ఈ మేరకు ఆమె గత రెండు రోజుల నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగుల చుట్టూ తిరుగుతూ తన గోడు వెళ్లబోసుకున్నా పట్టించుకునేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కోడుమూరు మండలం వేముగోడు గ్రామానికి చెందిన ఆమె గత నెల 12న వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కుక్ కమ్ కేర్ టేకర్ పోస్టుకు దరఖాస్తు చేసుకుంది. ఇటీవల విడుదల చేసిన మెరిట్ జాబితాలో తన మార్కులు తక్కువగా ఉండటంతో అనుమానంతో ఆమె కార్యాలయానికి వెళ్లి ఉద్యోగులను నిలదీసింది. ఈ నేపథ్యంలో ఆమె దరఖాస్తు తీసి చూడగా ఆమె పదవ తరగతి సర్టిఫికెట్ స్థానంలో ఇతర అభ్యర్థి సర్టిఫికెట్ ప్రత్యక్షమైంది. మాలతికి టెన్త్‌లో 8.5గ్రేడ్ ఉండగా ఇతర అభ్యర్థి సర్టిఫికెట్‌లో మాత్రం కేవలం 238 మార్కులు మాత్రమే ఉన్నాయి. తన మార్కులు అధికంగా ఉన్నాయని భావించి నాకు పోస్టు దక్కకుండా చేసేందుకు ఇతరులకు కట్టబెట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు ఇలా చేశారని, జిల్లా కలెక్టర్ ఈ విషయమై జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని ఆమె కన్నీటిపర్యంతమవుతూ కోరింది. ఈ విషయమై ఆమె కార్యాలయ ఏవో డాక్టర్ నాగప్రసాద్‌ను కలవగా తామింకా ఎవ్వరికీ పోస్టు ఇవ్వలేదని, పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పారు.

నేడు యునాని డే వేడుకలు

కర్నూలు(హాస్పిటల్): వరల్డ్ యునాని డే వేడుకలను ఈ నెల 11వ తేదీన స్థానిక కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ యునాని డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ షాకీర్ అహ్మద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఫయాజుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐటీడీఏ జాయింట్ డైరెక్టర్ ఎం.సరస్వతి, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య, కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా యునాని అవగాహన ర్యాలీ, ఉచిత వైద్యశిబిరం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రీసెర్చ్ స్కిల్స్‌తో నైపుణ్యాభివృద్ధి


క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కల్లూరు: రీసెర్చ్ స్కిల్స్‌తో నైపుణ్యం అభివృద్ధి చెందుతుందని కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డీవీఆర్ సాయి గోపాల్ అన్నారు. శుక్రవారం చిన్నటేకూరు సమీపంలోని సీఈఎస్ ఫార్మసీ కళాశాలలో ఐపీఏ కర్నూలు వారి ఆధ్వర్యంలో ఫార్మా అపోథియోసిస్–2023 నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్, ఫార్మసీ అకాడమిక్స్, రీసెర్చ్ రంగాల అనుసంధానంతో విద్యార్థుల్లో రీసెర్చ్ స్కిల్స్ నైపుణ్యత పెరుగుతుందన్నారు. ఐసీఎంఆర్–ఎన్‌టీటీఎం కర్ణాటక రాష్ట్రం బెల్గావిలోని శాస్త్రవేత్త డాక్టర్ బానప్ప ఎస్.అంగార్ రీసెర్చ్ స్ట్రాటజెమ్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో హైదరాబాద్‌లోని క్లినిఫైనేట్ సొల్యూషన్స్‌కు చెందిన శ్రీరామ్ వేదపురి, కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రకాష్, ఈ కాన్ఫరెన్స్‌లో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తా

కర్నూలు (టౌన్): ఈ నెల 5,6 తేదీలలో తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కర్నూలుకు చెందిన కరాటే క్రీడాకారులు సత్తాచాటా రు. ఈ పోటీల్లో గాంధీ, ఉమేరా, సాత్విక్, ఇస్మాయిల్ లు బంగారు పతకాలు,విక్రమ్ రజత పతకంసాధించినట్లు రాష్ట్ర కరాటే సంఘం అధ్యక్షులు కోలా ప్రతాప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా క్రీడాకా రులు పతకాలు సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు.

వర్మీ యూనిట్ షెడ్లు మరింత మెరుగుపడాలి


పాణ్యంలో పండ్ల దుకాణాల వద్ద వ్యర్థాలను సేకరిస్తున్న దృశ్యం

పాణ్యం: ప్రతి గ్రామం శుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉండేందుకు వర్మీ యూనిట్ షెడ్లు మరింత మెరుగుపడాలని డీఎల్‌పీఓ రాంబాబు సూచించారు. శుక్రవారం జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా పాణ్యం వర్మీ యూనిట్ వద్ద ఈఓఆర్డీలకు, గ్రామాల కార్యదర్శులకు, క్లాప్ సిబ్బందికి, షెడ్ నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గ్రామ శుభ్రతకు మొదటి అడుగు ఇంటి నుంచే పడాలన్నారు. తడి, పొడి చెత్త వేరుగా ఉంచి క్లాప్ సిబ్బందికి ఇవ్వాలన్నారు. అందుకు ఇప్పటికే ఇంటికి రెండు బుట్టలను అందజేశామన్నారు. తడి చెత్తను ఎండబెట్టడం, పొడి చెత్తను వానపాములు ఉన్న ప్రత్యేక షెడ్‌లో ఉంచడం ద్వారా వర్మీ ఎరువు తయారవుతుందన్నారు. దీని వలన గ్రామ పంచాయతీలకు ఆదాయంతో పాటు గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. అనంతరం శిక్షణకు వచ్చిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు బస్టాండ్‌లో అవగాహన కల్పించారు. పండ్ల దుకాణాల వద్దకు తీసుకెళ్లి తడి, పొడి చెత్తను ఎలా సేకరిస్తారనే విషయంపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ పద్మావతి, ఎంపీడీఓ దస్తగిరి, గ్రామ సర్పంచ్ మేకల పల్లవి, ఈఓ అనురాధ పాల్గొన్నారు.

ప్రతి చిన్నారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి


చిన్నారికి వేసిన టీకా పంపిణీ వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ రవికాంత్

కోడుమూరు రూరల్: సున్నా నుంచి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారి ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు, ఆరోగ్య సిబ్బంది శ్రద్ధ చూపాలని డాక్టర్ రవికాంత్ సూచించారు. చిన్నారులకు ఆరోగ్య సిబ్బంది సమయానికి టీకాలు వేస్తున్నారా లేదా, ఏయే టీకాలు ఎప్పుడెప్పుడు వేస్తున్నారు అనే విషయాలను డబ్ల్యూహెచ్‌ఓ పరిశీలన బృందం సభ్యులు డాక్టర్ రవికాంత్ శుక్రవారం ఆరోగ్యసిబ్బందితో కలిసి కోడుమూరులో పర్యటించారు. వివిధ రోగాల బారిన పడకుండా చిన్నారులకు టీకాలు వేయించాలన్నారు. అనంతరం స్థానిక హెల్త్ సెంటర్లను ఆయన తనిఖీ చేసి టీకాల పంపిణీ వివరాలను పరిశీలించారు.

ఎస్‌డీజీ సర్వేను పూర్తి చేయండి


ఎస్‌డీజీ సర్వేను తనిఖీ చేస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: సస్‌స్టేయినబుల్ డెవలెప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీ) సర్వేను పూర్తి చేయాలని ఈఓఆర్డీ సందీప్ సచివాలయాల సిబ్బందికి, వలంటీర్లకు, వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలో పలు గ్రామాల సచివాలయాలను తనిఖీ చే శారు. రికార్డుల నిర్వహణ, ఉద్యోగుల హాజరు పట్టికలను పరిశీలించి పలు సూచనలు చే శారు. పౌష్టికాహారలోపంతో బాధ పడుతున్న చిన్నారులు, రక్తహీనత ఉన్న కౌమార బాలికలు, గర్భిణులు, పాఠశాల, కళాశాలన్ను డ్రాపౌట్లపై సమగ్రంగా సర్వే నిర్వహించాన్నారు.

విద్యార్థులకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సి.బెళగల్: కబడ్డీలో ప్రతిభ కనబరిచిన బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను హెచ్ఎం నిర్మల వసంత కుమారి, పీఈటీ బిల్లా శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందం అభినందించింది. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ తమ పాఠశాల 9వ తరగతి విద్యార్థినులు ఎంబీ మానస, బి.రోజ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో అండర్ – 14 కబడ్డీ విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. శనివారం నుంచి చిత్తూరు జిల్లా నగరిలో జరగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. అక్కడ కూడా ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

పాణ్యం: పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కేఆర్‌ఆర్ తండాకు చెందిన జే.శంకర్‌నాయక్(55) తనకున్న 5 ఎకరాల పొలంలో అరటి, కొబ్బరి సాగు చేస్తూ జీవనం సాగించేవాడు. కొన్నేళ్లుగా దిగుబడులు సరిగ్గా రాకపోవడంతో అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చే దారిలేక గత నెల 26న పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య మంగీబాయి, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.